క్లుప్తంగా

ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

మర్రిగూడ : ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రులకు సంబంధించి ఓటు హక్కును ఫిబ్రవరి 6వరకు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ బక్కా శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అర్హత కలిగిన పట్టభద్రులు తమ డిగ్రీ సర్టిఫికెట్, ఓటరు, ఆధార్‌కార్డు, ఫొటోలతో ఆన్‌లైన్ లేదా, తహసీల్దార్ కార్యాలయంలో ఆఫ్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. మండలంలో 182మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

ఘనంగా మాయావతి జన్మదిన వేడుకలు



మాయావతి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

చండూరు : మండల కేంద్రంలో బీఎస్పీ జాతీయ నాయకురాలు మాయావతి జన్మదిన వేడుకలను మంగళవారం ఆపార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నేరెళ్ల ప్రభుదాస్, వినోద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా



బస్‌పాస్‌లు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

చిట్యాల : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆర్టీసీ నల్లగొండ డిపో ఆధ్వర్యంలో దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సదరం సర్టిఫికెట్ కలిగిన దివ్యాంగులకు అధికారులు ఆర్టీసీ రాయితీ బస్‌పాసులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారి వరకాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు మృతదేహం అప్పగింత

నల్లగొండ టౌన్ : నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి సాగర్‌కు చెందిన చెవ్వ రామ్‌రెడ్డి(70) మంగళవారం మృతి చెందాడు. దీంతో మట్టిమనిషి పాండురంగారావు సూచన మేరకు మృతుడి కుటుంబ సభ్యులు నల్లగొండ మెడికల్ కళాశాలకు రామ్‌రెడ్డి మృతదేహాన్ని అప్పగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజకుమారి, బుచ్చిబాబు, రమణ, వైస్‌ప్రిన్సిపాల్, అధికారులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



లయన్స్ క్లబ్ సభ్యులను సన్మానిస్తున్న సర్పంచ్ యాదయ్యగౌడ్, గ్రామస్తులు

కనగల్ : మండలంలోని దోరెపల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కనగల్ ఆధ్వర్యంలో మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. యోగా, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అవగాహన కల్పించారు. అదే విధంగా వైద్యశిబిరం నిర్వహించి గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, సర్పంచ్ అయితగోని యాదయ్యగౌడ్, ఉపసర్పంచ్ దాసరి వెంకన్న, లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు నర్సింగ్ లక్ష్మయ్యగౌడ్, సెక్రటరీ నీలకంఠం శేఖర్, కోశాధికారి చీదేటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి

చిట్యాల : డ్రెయినేజీ సమస్యను మున్సిపల్ అధికారులు వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ కోరారు. పట్టణంలోని రెండో వార్డులో భారత్ పెట్రోలియం బంకు ఎదురుగా ఉన్న డ్రెయినేజీని కొంతకాలంగా శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తుండడంతో మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట పార్టీ నాయకులతో పాటు కాలనీవాసులు ఐతరాజు యాదయ్య, జిట్ట రమేష్, వెంకటేష్, మారయ్య, శ్రీను, రాకేష్, గణేష్, నగేష్, యాదయ్య ఉన్నారు.

జైపాల్‌రెడ్డికి ఘన నివాళి

నకిరేకల్ : పట్టణంలో స్వర్గీయ మాజీ ఎంపీ జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు గాజుల సుకన్య, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, కొండ వెంకన్న, వేమవరపు నర్సింహ, గునగంటి రాజు, నాయకులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు లేక అవస్థలు

- రాంగ్‌రూట్‌లో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- హైవే నిర్మాణ సమయంలో అగ్రిమెంట్‌లు ఉన్నా పట్టించుకోని సంస్థ



సర్వీస్ రోడ్డు నిర్మించే స్థలంలో నాటిన చెట్లు



కట్టంగూర్‌లో సర్వీస్ రోడ్డు లేకపోవడంతో రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహనదారులు

కట్టంగూర్ : మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ నుంచి కురుమర్తి రోడ్డు వరకు సర్వీసు రోడ్డు నిర్మించకపోవడంతో రాకపోకలకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 65వ నంబర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బస్టాండ్ నుంచి కురుమర్తి రోడ్డు వరకు సర్వీసు రోడ్డు నిర్మించాలని నిబంధనలు ఉన్నా జీఎంఆర్ సంస్థ నిర్మించకుండా వదిలేసింది. దీంతో మండల కేంద్రంలోని పద్మశాలినగర్, ఇందిరమ్మకాలనీ ప్రజలతోపాటు కురుమర్తి, శాలిగౌరారం మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలు నిత్యం కట్టంగూర్‌కు, నల్లగొండకు రాంగ్‌రూట్‌లో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.

సర్వీస్ రోడ్డు ప్రదేశంలో మొక్కలు..

సర్వీస్ రోడ్డు నిర్మించాల్సిన ప్రదేశంలో హైవే పూర్తయిన ఐదు సంవత్సరాల అనంతరం హరిత హారంలో భాగంగా మొక్కలను నాటి జీఎంఆర్ సంస్థ చేతులు దులుపుకుంది. దీంతో కురుమర్తి రోడ్డు నుంచి కట్టంగూర్‌కు వచ్చే వాహనదారులు రాంగ్‌రూట్‌లో జంకుతూ ప్రయాణించే పరిస్థితులు నెలకొన్నాయి. కట్టంగూర్‌లో ప్రతి శనివారం జరిగే వారాంతపు సంతకు పద్మశాలి కాలనీ, ఇందిరమ్మకాలనీ ప్రజలతోపాటు కురుమర్తి నుంచి వాహనదారులు వస్తుంటారు. రాత్రి సమయంలో వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళుతూ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. పలుమార్లు ఆయా కాలనీ ప్రజలు జీఎంఆర్ సంస్థ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వీసు రోడ్డు నిర్మాణానికి విడిచి పెట్టిన స్థలంలో నాటిన మొక్కలను తొలగించి సర్వీసు రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వీస్ రోడ్డు నిర్మించాలి



జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బస్టాండ్ నుంచి కురుమర్తి రోడ్డు వరకు సర్వీస్ రోడ్డు నిర్మించాల్సి ఉండగా జీఎంఆర్ అధికారులు మొక్కలు నాటి చేతులు దులుపుకున్నారు. సర్వీసు రోడ్డు నిర్మించకపోవడంతో వాహనదారులు హైవే పక్క నుంచి రాంగ్‌రూట్‌లో వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. పలుమార్లు హైవే అధికారుల దృష్టికి కాలనీ ప్రజలు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– ముశం ఉమేష్, పద్మశాలినగర్, కట్టంగూర్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే వేముల వీరేశం



ఎస్‌టీయూ క్యాలెండర్, డైరీని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం పట్టణంలోని తనక్యాంపు కార్యాలయంలో నల్లగొండ, యాదాద్రి జిల్లాల స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టీయూ) సంఘాల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా బాధ్యులు పాఠశాలల్లో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొనకంచి వీరరాఘవులు, ఒంటెద్దు భిక్షంరెడ్డి, కల్లూరి రమేష్, దేవులపల్లి గణేషం, ప్రతినిధులు నరేందర్‌రెడ్డి, విజయ్‌ప్రసాద్, రమేష్, జాన్‌ఖాన్, వెంకటేశ్వర్లు, అశోక్‌రెడ్డి, పర్వతాలు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరావు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన చిన్ననాటి మిత్రులు

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని అతడి స్వగ్రామానికి చెందిన చిన్ననాటి మిత్రులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం వారినుద్దేశించి మాట్లాడారు. అన్నింటి కన్నా స్నేహం గొప్పదని అలాంటి స్నేహాన్ని కాపాడుకుంటూ పదికాలాల పాటు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో స్నేహితులు రంగు ముత్యంరాజు, శీలం కనకయ్య, గుండ్ల శ్రీనివాస్, కప్పల వెంకటేశ్వర్లు, భూపతి సత్యనారాయణ, అయితగోని యాదగిరి, కప్పల శ్రీనివాస్, రంగు వీరయ్య, కొత్తోజు బ్రహ్మాచారి, రంగు వెంకన్న, భూపతి పురుషోత్తం, పూర్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులతో కలిసి.. పతంగులు ఎగురవేసి

సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం కనుమ రోజు పట్టణంలోని తన ఇంటి ఎదుట ఎమ్మెల్యే వేముల వీరేశం చిన్నారులతో కలిసి పతంగులు ఎగురవేసి సందడి చేశారు.



ఎమ్మెల్యే వీరేశం దంపతులను సన్మానిస్తున్న ఆయన చిన్ననాటి మిత్రులు

అలరించిన అన్నమాచార్య సంకీర్తనలు

రామగిరి (నల్లగొండ): అన్నమాచార్య 42వ వార్షికోత్సవం 505వ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రామగిరిలోని సీతారామచంద్ర స్వామి ఆలయ ఆవరణలో అన్నమాచార్య సంకీర్తన ప్రచార సమితి ఆధ్వర్యంలో అన్నమాచార్య కీర్తలను హరిప్రియ, అవ్యక్త, మాధవి ఆలపించారు. వీరికి లక్ష్మీనారాయణ, తబల జయప్రకాష్, రిథమ్ కె.భిక్షం సహకరించారు. ఈ మాసం పాటల పుస్తకాన్ని ప్రముఖ న్యాయవాది అమరేందర్‌రావు , పురుషోత్తమాచార్యుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.



రామాలయంలో గానం చేస్తున్న హరిప్రియ, అవ్యక్త, మాధవి

ఘనంగా నిష్కళంకమాతా ఆలయ స్వర్ణోత్సవాలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్ : మండలంలోని ముత్యాలమ్మగూడెం జీపీ పరిధిలోని చిన్నపురి (కమ్మగూడెం) గ్రామంలో గల నిష్కళంకమాత దేవాలయంలో మూడు రోజుల పాటు క్రైస్తవులు స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వర్ణోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి క్రైస్తవులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, మాజీ జెడ్పీటీసీ సుంకర బోయిన నర్సింహ, పెద్ది సుక్కయ్య, రెడ్డిపల్లి సాగర్, ఫాదర్ గ్రాగోరి, కనుమూరి భాస్కర్, కొంక ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ పాలడుగు హరికృష్ణ, పాలిశెట్టి వెంకటేశ్వర్లు, బొడ్డుపలి సైదులు, సత్తయ్య తదితరులు ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని వీటీకాలనీలో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సహిత శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి కల్యాణవేదికపై అధిష్టించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం ధనుర్మాస వ్రత విశిష్టతను భక్తులకు ప్రవచనం చేశారు. కార్యక్రమంలో వీటీకాలనీ అధ్యక్షుడు నూకల జైపాల్‌రెడ్డి, మేడం ప్రభాకర్, చల్లా లింగారెడ్డి, జనార్దనాచారి, క్రిష్ణమాచారి, నాగార్జున, కృష్ణయ్య, ఎలిశాల ప్రభాకర్, ఎన్‌సి పద్మ, అంజమ్మ, సుమలత, భారతి, జ్యోతి, జానకి పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరాముడి అక్షింతల పంపిణీ



కనగల్ : అక్షింతలు పంపిణీ చేస్తున్న నాయకులు

కనగల్ : మండలంలోని రేగట్టే గ్రామంలో అయోధ్య శ్రీరాముడి అక్షింతలను మంగళవారం భక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలో రామమందిరం నిర్మాణం ప్రతిష్ఠ సందర్భంగా ప్రజలందరూ అక్షింతలు తలపై చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో తిరందాసు సంతోష్‌కుమార్, కర్నాటి శీను, గంజి వెంకటేశం, పున్న శ్రీకాంత్, శివశంకర్, గంజి నరేష్, గంజి ధనుంజయ, నిరంజన్ కర్నాటి రాజు, కారింగు శంకర్, వేముల వెంకట్, వేముల రాజు, తిరందాసు శేఖర్, మల్లయ్య, మేకల వెంకన్న, గంజి రాజారాం తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామంలో అయోధ్య శ్రీరాముడి అక్షింతలను సోమవారం, మంగళవారం బీజేపీ నాయకులు ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు వెల్డి రాఘవరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు రూపని లింగస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు అంశల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : అయోధ్యలో ఈనెల 21, 22తేదీల్లో జరిగే రామజన్మ భూమి శంకుస్థాపనలో హిందువులంతా భాగస్వాములవ్వాలని గ్రామభారతి సలహాదారుడు మిర్యాల రఘురాములు మంగళవారం కోరారు. ఈ సందర్భంగా హిందువులందరూ ఆ రెండు రోజులు మాంసం, మద్యం తీసుకోకుండా నిష్ఠను కలిగి ఉండాలని ఆయన అన్నారు.



చిట్యాల : ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతలు పంపిణీ చేస్తున్న నాయకులు

● ఆరు గ్యారంటీల ముగ్గు



కాంగ్రెస్ పార్టీ, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీద అభిమానంతో ఆ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను సంక్రాంతి ముగ్గు రూపంలో వేశానని నల్లగొండ పట్టణంలోని 29వార్డుకి చెందిన వడ్డేపల్లి శ్రీ మహాలక్ష్మి తెలిపారు. కనుమ పండుగ సందర్భంగా తమ ఇంటి వాకిట్లో మంగళవారం వినూత్న రీతిలో ముగ్గులు వేశారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

ముగ్గుల పోటీలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మునుగోడు : ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దంపతులు



మర్రిగూడ : విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

మునుగోడు : ముగ్గుల పోటీలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో జెడ్పీటీసీ నారబోయిన స్వరూపరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను ఆయన తన సతీమణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పండుగల సందడి, సంప్రదాయాలు గ్రామీణ ప్రాంతాల్లో కన్పిస్తుందన్నారు. జెడ్పీటీసీ స్వరూపరాణి ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని, రానున్న రోజుల్లో మరిని కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని, అందుకు తనవంతు సహాయ, సహకారాలు అందజేస్తానన్నారు. అనంతరం విజేతలకు బహుమతులతో పాటు నగదు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవి, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, జాల వెంకన్నయాదవ్, ఎండీ రఫీక్, నడిపల్లి యాదయ్య, మాదగోని రాజేష్‌గౌడ్, మేడి యాదయ్య, సాగర్ల లింగస్వామి, బూడిద లింగయ్యయాదవ్, పాల్వాయి చెన్నారెడ్డి, తాటికొండ సైదులు, జంగిలి నాగరాజు, బండారి మల్లేష్, బీసం విజయ్, జెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చండూరు : తెలంగాణ సంస్కృతికి ముగ్గుల పోటీలు ప్రతీక అని రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయగౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బోడంగిపర్తి గ్రామంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీసర్పంచ్ తోటకూరి వెంకన్న, కాంగ్రెస్ నాయకులు చెనగోని నందు, ఎం.జంగయ్య, టి.యమున, సాగర్ల సరిత, వీణ, సైదమ్మ, గౌసియాబేగం, పుష్ప, ఎం.నవ్య, గౌతమి, దీపిక, మౌనిక, సరస్వతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఖుదాబాక్షపల్లిలో ముగ్గుల పోటీలు

మర్రిగూడ : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని ఖుదాబాక్షపల్లి గ్రామంలో పీఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో మహిళలకు మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి కార్యక్రమానికి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, ఉపసర్పంచ్ మైలారపు పార్వతమ్మ గిరీష్, మండల ఉపాధ్యక్షుడు పందుల పాండు గౌడ్, వార్డు మెంబర్లు కారింగు యాదమ్మ, మాదగోని ఎల్లమ్మ, పల్లె మహేందర్‌రెడ్డి, ఐతరాజు నాగరాజు, నర్సింగు, నరసింహ, తోకల నరేష్, బొడ్డుపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రికెట్ పోటీలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకోని మండలంలోని ఖుదాభక్షపల్లి, కొండూరు గ్రామాల్లో మంగళవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. కాగా ఖుదాభక్షపల్లి పరిధిలోని సాయిబండాతండాలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌కు గ్రామానికి చెందిన మాతంగి నవీన్ క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, కొండూరు సర్పంచ్ కుంభం నర్సమ్మమాధవరెడ్డి, ఎంపీటీసీ తుమ్మల వరప్రసాద్, పాలకూరి జంగయ్య, నీలా భాస్కర్, ఆకుల వెంకట్రామ్, కొడాల అల్వాల్‌రెడ్డి, రాపోలు గణేష్, నక్కగిరి, పోలె మహేష్, నాగరాజు, అజయ్, నర్సింగ్ యాదయ్యగౌడ్, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామంలో గ్రామానికి చెందిన ×ఓన్లీ మాస్–నో క్లాస్‌×వాట్సాప్ గ్రూపు ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొని విజేతలైన క్రీడాకారులకు మంగళవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎలకరాజు అంజనేయులు, పబ్బు దేవేందర్‌గౌడ్, మహంకాళి లింగస్వామి, అర్రూరి శ్రీశైలం, దేశబోయిన నర్సింహ, ఖాజుపాషా, వాట్సాప్ గ్రూపు అడ్మిన్ మాటకారి మహంకాళి, అంతటి ప్రశాంత్‌గౌడ్, అంతటి శ్రీనువాస్, కోమటి రాము, పబ్బు అశోక్‌కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



చండూరు : బోడంగిపర్తిలో బహుమతులు అందజేస్తున్న ధనుంజయ్య

బీమారంలో ముగ్గుల పోటీలు

కేతేపల్లి : సంస్కృతి, సంప్రదాయాలకు ముగ్గులు ప్రతీకలుగా నిలుస్తాయని బీమారం సర్పంచ్ బడుగుల శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని బీమారంలో సంక్రాంతి పండగ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ తల్లిదండ్రులు అంతయ్య– ఎలమంచమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొని మాట్లాడారు. ప్రాచీన సంస్కృతిని భావితరాలకు అందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన వారికి ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గూడపూరి స్వప్న, ఎండీ.ఫరీద్, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



చిట్యాల : క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



కేతేపల్లి : విజేతలకు చీరలు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్



మర్రిగూడ : బహుమతులు అందజేస్తున్న నాయకులు

పరిశ్రమ విస్తరణను నిలపాలని వినతి

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామపరిధిలో గల ఎంపీఎల్ పరిశ్రమ నుంచి వస్తున్న కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని, ఆ పరిశ్రమ విస్తరణను నిలిపివేయాలని కోరుతూ పరిశ్రమ సమీపంలో గల పిట్టంపల్లి గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ జి.దశరథకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిశ్రమ నుంచి వస్తున్న కాలుష్యంతో గ్రామస్తులతో పాటు పశువులు, గొర్రెలు, మేకలు రోగాల బారిన పడుతున్నారని, తాగునీరు సైతం కలుషితమై వ్యాధులు వస్తున్నాయని వాపోయారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో ఎంపీటీసీ దేవరపల్లి సత్తిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు తుమ్మల నాగరాజు రెడ్డి, పలువురు గ్రామస్తులు ఉన్నారు.



తహసీల్దార్ దశరథకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

'మహిళా శక్తి సమ్మేళనం' కరపత్రం విడుదల



కరపత్రం విడుదల చేస్తున్న మహిళా నాయకులు

రామగిరి (నల్లగొండ) : నల్లగొండలో ఈనెల 28న నిర్వహించనున్న మహిళా శక్తి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంత ప్రభారి వరలక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలోని మాధవ స్మారక నిలయంలో సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను ఆమె విడుదల చేసి మాట్లాడారు. మహిళా శక్తి సమ్మేళన కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 18 నుంచి 60సంవత్సరాలున్న మహిళలంతా పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పట్టణంలోని గంధంవారిగూడెంలో గల గుండగోని మైసయ్య కన్వెన్షన్ హాలులో 9.30నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వప్న, వినీలారెడ్డి, నన్నూరి లత, దేవిక, వసంత, అరుణ, జ్యోతి, విజయ, అనురాధ, పావని, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి, కనుమ వేడుకలు

రామగిరి(నల్లగొండ) : పట్టణంలో సంక్రాంతి, కనుమ వేడుకలను సోమ, మంగళవారాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఇళ్ల ఎదుట రంగురంగుల ముగ్గులు వేశారు.

కట్టంగూర్ : మండలంలో సోమ, మంగళవారం సంక్రాంతి, కనుమ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. పిల్లలు, యువతీ యువకులు పతంగులను ఎగురవేసి సందడి చేశారు. మండల కేంద్రంలో శ్రీరామ సేవాసమితి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి సేవా సమితి అధ్యక్షుడు మూడుదుడ్ల సాయినాథ్ బహుమతులు అందజేశారు. అదే విధంగా దుగినవెల్లి హైస్కూల్‌లో సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులకు సర్పంచ్ వెంకన్న బహుమతులు అందజేశారు.

చిట్యాల : మండలంలో సోమ, మంగళవారాల్లో సంక్రాంతి, కనుమ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు తమ ఇళ్ల ఎదుట వివిధ రంగులతో ముగ్గులను వేశారు. పెద్దకాపర్తి గ్రామంలో మంగళవారం కనుమ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్‌లు కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి–రేణుక దంపతులు ఎడ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు, క్రికెట్ కిట్లను అందజేశారు.

నకిరేకల్ : పట్టణ ప్రజలు సోమ, మంగళవారాల్లో సంక్రాంతి, కనుమ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని శ్రీఐశ్వర్యసాయి, శ్రీవేంకటేశ్వర స్వామి, శివాలయం, కనకదుర్గ, గీతామందిరం ఆలయాల్లో పూజలు చేశారు. కనుమ సందర్భంగా పశుసంపదను అలంకరించి ఆరాధించారు.